

నాంచారిమడూర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వెంకటాపురంలో మహిళలను కలిసి ఓటడుగుతున్న మంత్రి ఎర్రబెల్లి

# బీఆర్‌ఎస్‌తోనే పండుగలా వ్యవసాయం

- కరువు నేలను కోనసీమలా మార్చిన సీఎం కేసీఆర్
- ఇంటింటికీ అందిన సంక్షేమ పథకాలు
- పాలకుర్తి నియోజకవర్గంలో వందల కోట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు
- డబ్బుతో గెలుస్తామనే అహంకారంలో కాంగ్రెస్
- ప్రజల కష్ట సుఖాల్లో తోడు నడిచిన నన్ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఎన్నికల ప్రచారంలో ఎర్రబెల్లితో సుధాకర్‌రావు

తొర్రూరు, నవంబర్ 18 : కరువుతో నెర్రెలు బారిన నేలను సస్యశామలం చేసి బీడు భూములకు సాగునీరందించిన ఈ ప్రాంతాన్ని కోనసీమలా మార్చిన సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మార్చారని బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ముఖ్య మంత్రి ఆశీస్సులతో వందల కోట్ల నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన నన్ను పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తొర్రూరు మండలం గుడిబండ తండా, నాంచారిమడూర్, పెద్దమంగ్యా తండా, టీక్యాతండా, వెంకటాపురం, అమర్‌సింగ్‌తండా, దుబ్బతండా, హరిపిరాల, కర్కాల గ్రామాల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఒకప్పుడు కరువుతో అల్లాడే ఈ ప్రాంతం నేడు జలకళతో పచ్చటి పైర్లతో కళకళలాడుతోందని, దీనికి సీఎం కేసీఆర్ కారణం కాదా ఆలోచించాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ద్వారా వచ్చే నీటితో పాలకుర్తి నియోజకవర్గంలో లక్షా 15 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయని, వేసవిలో కూడా చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయని తెలిపారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేయడంతోపాటు రైతు పండించిన ధాన్యాన్ని, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నదని ఎర్రబెల్లి తెలిపారు. ఒక మోటర్‌కు ఏటా కనీసం లక్ష రూపాయల విద్యుత్ బిల్లు వస్తుందని, ఇదంతా ప్రభుత్వానికి భారమైనా రైతులకు న్యాయం చేయాలని సీఎం కేసీఆర్ వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలను ప్రజలు నమ్మొద్దని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్‌కు మించి రాదని ఆయన వివరించారు.

**ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నా..**

పాలకుర్తి నియోజకవర్గంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నామని మంత్రి ఎర్రబెల్లి వివరించారు. నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, స్టడీమెటీరిల్ పంపిణీ, కరోనా కాలంలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, నిత్యావసర సరుకులు, ఆనందయ్య మందు అందజేసినట్లు గుర్తుచేశారు. ఎంతో మంది బాధితులకు నేరుగా ఆసుపత్రుల్లో సహాయం అందించానన్నారు. కానీ ఈ ప్రాంతానికి ఎంతో చేశానని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు కరోనా కాలంలో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. యువతకు, అవసరార్థుల కోసం కోట్లు వెచ్చించి డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఉపాధి కూలీలకు కిట్లు అందజేశామన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని ఊరూరా కుట్టు శిక్షణ ఇప్పించి ఉచితంగా మిషన్లు అందజేయడమే కాకుండా వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో ప్రతిభ ఆధారంగా రూ.15 వేల వరకు నెలసరి ఆదాయం సమకూర్చుకునేలా వందలాది ఉద్యోగాలు కల్పించబోతున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో కోతుల బాధ లేకుండా కార్యాచరణ చేపట్టామన్నారు. కష్టకాలంలో మీ వెంట ఉన్న దయన్నను కాపాడతారా.. లేదంటే ఆమెరికా నుంచి సూట్ కేసుల్లో డబ్బులు తెచ్చి ఓట్లు కొనాలని చూస్తున్న కాంగ్రెస్ వాళ్లని కాపాడతారా..? మీరే ఆలోచించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. కేవలం ఎన్నికలప్పుడు వచ్చి తర్వాత వెళ్లిపోయే వలస పక్షులను పట్టించుకోవద్దన్నారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో నన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎర్రబెల్లిని భారీ మెజార్టీతో గెలిపించాలి : సుధాకర్‌రావు**

పాలకుర్తి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి ఊరూరికి సాగు నీరు, ఇంటింటికీ తాగునీరు అందించేలా కృషి చేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావును ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్ రావు పిలుపునిచ్చారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌ను నమ్మొద్దన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే పేదలందరికీ వ్యక్తిగత బీమాతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15 లక్షల వరకు వైద్య చికిత్స అందించేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని సుధాకర్‌రావు తెలిపారు.

**రియల్ ఎస్టేట్ వ్యాపారుల మద్దతు**

పాలకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు తొర్రూరు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు మద్దతు తెలిపారు. శనివారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో దయాకర్‌రావును కలిసి ఈ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

## ఎన్నికల అధికారుల శిక్షణను పరిశీలించిన కలెక్టర్

జనగామ, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల మాస్టర్ ట్రేనర్స్, మైక్రో అబ్జర్వర్ల, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్స్ , పోల్ డే రోజు రిస్క్ మేనేజ్మెంట్‌పై సెక్టరోల్ అధికారులు, సిబ్బందికి శనివారం శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాల్లో తీసుకుంటున్న చర్యలనుజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య సమీక్షించారు. పీవో, ఏపీవోలకు రెండో దశ శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని మాస్టర్ ట్రైనర్స్‌ను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నోడల్ ఆఫీసర్లు, జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీఏవో వినోద్ కుమార్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సయ్యద్ ఇస్మాయిల్, డీఈవో రాము, డీపీవో రంగాచారి, మాస్టర్ ట్రేనర్స్ రామరాజు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్వోకు ఓటింగ్ యంత్రాల కేటాయింపు

జనగామ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ కే రాజమణి, రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ నేతృత్వంలో నిర్వహించారు. అభ్యర్థులు, వారి తరుపున ప్రతినిధుల సమక్షంలో వివరించారు. నియోజకవర్గ పరిధిలోని 277 పోలింగ్ కేంద్రాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్‌ను కేటాయించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివలింగయ్య

## కార్తీక మాస ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జనగామ, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 26న నిర్వహించే కార్తీక పౌర్ణమి, గిరిప్రదక్షిణ, లక్ష దీపోత్సవం, అఖండ జ్యోతి దర్శనం కొనసాగనుంది. దీనికి సంబంధించిన ఉత్సవాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ శివలింగయ్య శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు పాల్గొన్నారు.



స్వామివారి వార కల్యాణంలో అర్చకులు, భక్తులు

## వైభవంగా వెంకన్న వార కల్యాణం

చిల్పూరు, నవంబర్ 18 : కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేశారు. దాతలు కల్లూరి దామోదర్ శకుంతల దంపతులు, నీలం రాంబాబు సూర్యావతి, కుమారి గుంటి గౌతమి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు, ఈవో బీ లక్ష్మీప్రసన్న, ఆలయ శాశ్వత దాత సంగోజు లక్ష్మీ-మోహన్ దంపతులు, సొసైటీ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మార్కెట్ డైరెక్టర్ చల్లారపు శ్యాంసుందర్‌రెడ్డి, దేవస్థాన డైరెక్టర్లు కుంచాల సంపత్‌రాజ్, గుంపుల రవీందర్‌రెడ్డి, జంగటి కుమారస్వామి, గట్టు చేరాలు, అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, విశాల్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# ప్రజా సేవకుడు కడియం శ్రీహరిని గెలిపించాలి

**ఎన్నికల ప్రచారంలో కడియం కూతుళ్లు, బీఆర్‌ఎస్ నేతలు**

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 18 : పదవిలో ఉన్నా, లేకున్నా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజాసేవకుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని కడియం శ్రీహరి కూతుళ్లు డాక్టర్ కడియం కావ్య, కడియం రమ్య ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి వారు మండలంలోని శివునిపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కడియం శ్రీహరిని గెలిపించాలని వారు కోరారు. మహిళల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. మిషన్‌భగీరథతో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు ఇస్తున్నారని తెలిపారు. పేదింటి ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో రూ.లక్షా 116 చొప్పున అందిస్తూ అండగా నిలిచారని డాక్టర్ కడియం కావ్య తెలిపారు. మూడు దశాబ్దాలుగా కడియం శ్రీహరి ప్రజల కోసం నిజాయితీగా సేవలందిస్తున్నారని వారు వివరించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో దేవాదుల రిజర్వాయర్‌ను నిర్మించడంలో కృషిని వివరిస్తూ ఈ ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలను తొలగించారని వారు గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఉంటూ ఈ నియోజకవర్గంపై అవగాహన లేకుండా కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల సమయంలోనా దళితులంటూ వచ్చి ఓట్లడుగుతున్నారని విమర్శించారు. ప్రజల కోసం సేవలందించే కడియం శ్రీహరిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు.



శివునిపల్లిలో ప్రజలకు బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న డాక్టర్ కడియం కావ్య, నాయకులు

**20న జరిగే సీఎం కేసీఆర్ సభకు తరలిరావాలి**

ఈ నెల 20న శివారెడ్డిపల్లి సమీపంలో జరిగే సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని డాక్టర్ కడియం కావ్య, రమ్య, బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బూర్ల లతా శంకర్, మార్కెట్ డైరెక్టర్ చిగురు సరిత, మాజీ సర్పంచ్ హిమబిందు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బూర్ల శంకర్, పార్శి కృష్ణారావు, పార్శి రంగారావు, ఎంపీటీసీ గుర్రం రాజు, సొసైటీ డైరెక్టర్ తోట సత్యం, మాజీ సర్పంచ్ కొంతం శ్రీనివాస్, నీరటి ప్రభాకర్, నాయకులు వంగ శ్రీనివాస్, గుర్రం శంకర్, తెల్లాకుల రామకృష్ణ, గోలి రాజశేఖర్, గుర్రం రాజు, అమ్జద్ పాష, గుర్రం శ్రీను, గుండె మల్లేశ్, చిట్టిబాబు, కడియం యువసేన సభ్యులు బూర్ల రాజు, ఇల్లందుల విజయ్, బూర్ల శ్రీను, సంపత్ రాజు, ఆరెల్లి అశోక్ పాల్గొన్నారు.